
# చివరకు మిగిలేది



ఆదెళ్ళ శివకుమార్

"అయ్యా... తమరు కాస్త దయ చూపించాలి...."

రక్తం పీల్చే ముందు డ్రాకులా మాదిరిగా నవ్వాడాయన.

'డెబ్బై వేలు కడితేనే ఆపరేషన్... లేకపోతే నీ పెళ్ళాం మీద ఆశలొదులుకోవాల్సిందే..."

డాక్టరుగారి ముందు నిలబడ్డ జరాబందీ ఆ మాయదారి రోగం తన భార్యకు కాకుండా తనకే వచ్చుంటే ఎంత బాగుండేదా! అనుకున్నాడు. అలా అనుకోవటం అప్పటికి వందోసారి. భార్యమీద ప్రేమతో ఆ విధంగా అనుకున్నాడు కానీ తన భార్య కూడా డాక్టరు గారి ముందు నిలబడి ఇదే విధంగా దీనంగా తన కోసం అర్థిస్తూ ఉండేదన్నంత దూరం ఆలోచించలేకపోయాడు.

కానీ డెబ్బై వేలు ... ఓ వ్యవసాయ కూలీ డెబ్బై వేలు ఎక్కడ నుంచి తేగలడు?

భరించరాని బాధతో ఉంగలు చుట్టుకుపోయే భార్య ముఖమే గుర్తుకు వచ్చింది. తల్లిలా చూసుకునే భార్య, ఇద్దరు బిడ్డల తల్లి, మూడేళ్ళ నుంచి ప్రభుత్వ

ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఏమీ లాభం లేకపోయింది. అక్కడిచ్చిన మందులు ఆమె రోగాన్ని ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. అవి అసలు మందు లైతేగా! తలనొప్పి, జ్వరం దగ్గర్నుంచీ కిడ్నీ ప్రాబ్లం దాకా ఒకే రకమైన మందులిస్తారు. వెయ్యి రూపాయలు అప్పు చేసి భార్యను పట్నం తీసుకొచ్చి ఓ హాస్పిటల్‌లో చూపించాడు.

అక్కడ నుంచీ మొదలు...

నాలుగు ఇంజెక్షన్లు చేసి ఎడ్మిట్ చేసుకున్నారు. డిపాజిట్ పది వేలు కట్టమనే సరికి జరాబందీ తెల్లముఖం వేశాడు. హాస్పిటల్ స్టాఫ్ జరాబందిని పెద్ద డాక్టరు గారి ముందు ప్రవేశపెట్టారు. ఆయన చెప్పిందేమీ బుర్రకు ఎక్కలేదు. అర్థమయ్యిందల్లా డెబ్బై వేలు లేనిదే ఆపరేషన్ చేయరు... ఆపరేషన్ చేయకపోతే భార్య బ్రతకదు.

ఓ వైపు భార్య ప్రాణం... ఇంకోవైపు డెబ్బై వేలు...

"ఏంటీ చెప్పు తొందరగా. నాకు టైం లేదు..."

డాక్టరుగాని అదిలింపుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. "అయ్యా... కూలి చేసుకునే పేదోల్లం... డెబ్బై వేలంటే ఏడ నుంచి తెస్తాం దొరా..."

"రిజర్వు బ్యాంకుకి కన్నం వేయ్..." తన జోక్‌కు తనే పగలబడి నవ్వుకున్నారు డాక్టరుగారు. నవ్వుతూనే చటుక్కున నవ్వు ఆపేసి క్రూరంగా ముఖం పెట్టి "నాలుగు రోజుల్లో డెబ్బై వేలు తెచ్చి ఆపరేషన్ చేయించకపోతే నీ పెళ్ళాం పాడెక్కుతుంది... ఇంకెళ్ళు..." అన్నాడు.

జరాబందీ డాక్టరుగారికి దండం పెట్టి గదిలోంచి బైటకు నడిచాడు. ఎంత ప్రార్థించినా డాక్టరుగారు ఏ మాత్రం కరగరని అర్థం అయిపోయింది...

భార్య ప్రాణం విలువ డెబ్బై వేలు.

తడబడుతున్న అడుగులతో భార్య మంచం దగ్గరకు బయలుదేరిన జరాబందీ ఓ నిర్ణయానికి వచ్చేశాడు. తనుండే గుడిసె స్థలం, నాలుగు గింజలిచ్చే అరెకరం పొలం అమ్మేయటం. రెండూ అమ్మేస్తే ఎంతొస్తుంది?

జరాబందీ ఆ లెక్కల్లో ఉంటే...

లోపలి గదిలో డాక్టరుగారు ఆ రోజు కలెక్షన్స్ చూసుకుంటూ మరో కాలిక్యులేషన్‌లో ఉన్నారు.

'మరో రెండున్నర లక్షలు... ఆ ఎమౌంట్ కట్టేస్తే అమీర్‌పేటలో త్రీ బెడ్‌రూమ్ డీలక్స్ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ అయిపోతుంది.

నాలుగురోజుల్లో రిజిస్ట్రేషన్... ఈ లోపల రెండున్నర లక్షలు సంపాదించాలి...ఎలా?

* * *

"ఏమయ్యిందిరా నీ పెళ్ళానికి?"

"కేన్సరటండీ... డాక్టరుగోరు చెప్పారు...."

"అయ్యో! పాపం పెద్ద జబ్బే..." సేటుగారు జాలి చూపించారు.

ఆ మాత్రానికే జరాబందీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సేటుగారికున్న జాలి, మంచి మనస్సు డాక్టరుగారికి ఉంటే ఎంత బాగుండేదో అనుకున్నాడు

"ఆప్రేషన్ చేయాలంటే డెబ్బై ఏలు కావాలండీ..."

"డెబ్బై వేలే..."

"అవునండీ సేటుగారూ... నా పొలం, ఇల్లు తీసుకుని డెబ్బై వేలు ఇప్పించండి."

"నేనేం చేసుకోన్రా..." సేటుగారు దీర్ఘం తీశారు. "వ్యవసాయం చేయలేక నాకున్న పొలమే అమ్మేద్దామనుకుంటున్నా..."

జరాబందీ నీరుగారిపోయాడు.

"అట్టా అనమాకండి దొరా... నువ్వు కాదంటే నా పెళ్ళాం చచ్చిపోద్ది..."

సేటుగారు జరాబందీ వైపు చిరాగ్గా చూశాడు.

"వద్దంటే వినవేరా..."

జరాబందీ సేటుగారి కాళ్ళమీద పడి భోరుమన్నాడు.

"దొరా... నా పెళ్ళాం చచ్చిపోతే నా బిడ్డలు దిక్కులేనోళ్ళయిపోతారు దొరా... దయజూడు దొరా..."

దెబ్బకొట్టే స్థాయిలో పరిస్థితి వేడెక్కిందని గమనించిన సేటుగారు అరగంట తర్వాత కరిగారు.

వ్యాపారంలో ఆయన టెక్నిక్కులు ఆయనకున్నాయి. కోహినూర్ వజ్రం పట్టుకెళ్ళినా అయ్యో.. నాకెందుకు? నేనేం చేసుకుంటాను...' అంటాడు. ఎదుటివాడి అవసరాన్ని ఈ లోగా స్పీడ్‌గా అంచనావేసి వీలైనంత తక్కువలో కొట్టేస్తాడు...

ఆ విధంగా జరాబందీ అరెకరం పొలం, ఇంటి స్థలాన్ని ఏదో జాలితో కొంటున్నట్లుగా బిల్డప్ ఇచ్చి కొన్నారు సేటుగారు.

అవసరం, అవకాశం తాలూకు కాలిక్యులేషన్స్ తెలీని జరాబందీ సేటుగారికి దండం పెట్టి వెళ్ళిపోయాక సేటుగారు తాపీగా లెక్కలేసుకున్నారు.

హీనపక్షం అరవై వేలు లాభం. లక్ష రూపాయలు ఖరీదు చేసే పొలం యాభై వేలకు వచ్చింది. ఇంకో అదృష్టం ఏమిటంటే తన చేను ప్రక్క చేను. ఈ అరెకరం కలుపుకుంటే యాభై ఎనిమిదన్నర ఎకరాలవుతుంది.

ప్రక్కన నాయుడిగారిది, వెంకటప్పయ్యది కూడా కొనేస్తే ఏక చదరం వందెకరాలవుతుంది.

పదేళ్ళ క్రితం సెంటర్‌లో నిలబడి జంతికలు అమ్ముకున్నవాడు వందెకరాల ఆసామంటే సామాన్యమా?

చచ్చేలోగా...

కోటి రూపాయల క్యాషూ, వందెకరాల

## అంతకోపం పనికి రాదు!

కోపం మనిషిలోని వివేకాన్ని సమూలంగా నాశనం చేస్తుంది. ఇందువల్ల క్షణాల్లో మన మీద ఇతరులకు ఉన్న గౌరవాన్ని కోల్పోతుంటాము. సహనం మనల్ని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళుతుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే అయినా ఆ క్షణంలో కోపాన్ని అదుపులో ఉంచుకోవడం కష్టతరమవుతుంది. తన కోపమే తన శత్రువు అంటారు. అంటే కోపం మిత్రువులను కూడా శత్రువులుగా మారుస్తుంది. కావున కోపాన్ని వీలైనంత వరకూ అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. అందుకు క్రింద పేర్కొన్న టిప్స్ ట్రై చేసి చూడండి.



✤ కోపం వచ్చినప్పుడు దాన్ని అదుపులో ఉంచుకోవడానికి చల్లని నీటితో ముఖం కడుక్కోవడం, మంచి నీరు తాగడం చేయాలి.

✤ మీ మాటలో స్పష్టత, సరళతతో పాటు సంక్షిప్తత ఉండాలి. ఇందువల్ల ఇతరులను కించపరిచే విధంగా మాట్లాడే అవకాశం ఉండదు. అలాగే వ్యంగ్యంగా మాట్లాడకూడదు.

✤ కోపం వచ్చిన సమయంలో మానసికస్థితి సరైన రీతిలో ఉండేలా చూసుకోవాలి. ధైర్యం, ఓర్పును కోల్పోకూడదు.

✤ మీపై కుటుంబ సభ్యులెవరికైనా కోపం వచ్చి దాన్ని ప్రదర్శిస్తే, ఆ సమయంలో వారితో వాదప్రతివాదాలకు దిగకుండా కోపం తగ్గేవరకూ ఎదురుచూసి ఆ తరువాత అసలు విషయాన్ని నిదానంగా చెబితే వారి మధ్య చీలికలు ఏర్పడే అవకాశం ఉత్పన్నమవ్వదు.

✤ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటే కోపం వచ్చే అవకాశం క్రమంగా తగ్గుతుంది. చేతకానితనం కూడా కోపానికి ఒక కారణం.

\- ఎమ్.నాగలక్ష్మి

# కెరీర్‌ను ఎలా ఎంచుకోవాలి!



ప్రతి ఒకరూ కెరీర్‌లో సక్సెస్ సాధించాలని ఉవ్విళూరుతుంటారు. కానీ కొందరికి ఆ కల నిజమవుతుంది. మరికొందరికి అది కలగానే మిగిలిపోతుంది. నేడు యువతీ, యువకులు డబ్బు, కీర్తి ఎక్కువగా ఉన్న కెరీర్‌ను ఎంచుకోవాలనే కోరుకుంటున్నారు. కొందరికి అనుకున్న కోర్సులో అడ్మిషన్ దొరకదు. మరికొందరికి అసలు ఏం చదవాలో తమకు ఎటువంటి కోర్సు అయితే సరిపోతుందో కూడా తెల్సుకోలేరు. ఇలాంటి వారు కెరీర్‌లో సక్సెస్ సాధించలేరు. వారికి తాము ఎంచుకున్న కెరీర్ సరైనదిగా తోచదు. ఈ సమస్యలన్నింటి నుంచి విముక్తి పొందాలంటే సరైన కోర్సును ఎంచుకోవటమే మార్గం. కెరీర్‌ను సెలక్ట్ చేసుకునే ముందు మన లక్ష్యం ఏమిటన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. సాధారణంగా యువతీ, యువకులందరూ డబ్బు, గ్లామర్, కీర్తి ఉన్న కెరీర్‌ను ఎంచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే కెరీర్‌ను ఎంచుకొనే ముందు నాలుగు విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. 1. విద్యార్థి రుచి అభిరుచి. 2. ఏ కెరీర్‌నైతే విద్యార్థి ఎంచుకుంటున్నాడో అందులో విజయం సాధించగలన్న నమ్మకం, సబ్జెక్ట్‌పై అభిరుచి. 3. ట్రైనింగ్ ఎక్కడ తీసుకోవాలి, కోర్సు ఎక్కడ చేయాలి. 4. వ్యాపారమా లేక ఉద్యోగమా అన్న విషయాలను పరిగణలోకి తీసుకోవాలి.

పిల్లలకు చిన్న వయస్సు నుంచే తాము ఏం చదవాలో నిర్ణయించుకొనగలిగే శిక్షణ ఇవ్వాలి. దీనివల్ల తాము ఏం కావాలనుకుంటున్నది చిన్న తనంలోనే తెలుసుకొనగలుగుతారు. కెరీర్ కౌన్సిలింగ్ ద్వారా కూడా పిల్లల అభిరుచిని తెలుసుకొనవచ్చు. ఫ్యాషన్ డిజైనింగ్, టూరిజమ్, ఇంటీరియర్, కంప్యూటర్ ఇలా రకరకాల కోర్సులలో వారికి శిక్షణను ఇప్పించవచ్చు.

- ఎస్.ఎల్.బి

పొలం, పది కిలోల బంగారం, నాలుగు మేడలు... ప్రస్తుతానికి అదీ సేటుగారి లక్ష్యం. శుభం....

* * *

"పద్దెనిమిది లక్షలకు ఫ్లాట్ ఇస్తానని నేనేమన్నా చెప్పానా?"

డాక్టరుగారు కంగారుతో చెమటలు తుడుచుకున్నారు.

"అదేంట్సార్ అలాగంటారు? మనం ఎగ్రిమెంటులో అంతేగా రాసుకుంది..."

"ఎగ్రిమెంట్‌లో అట్టాగుందా? అయితే కోర్టుకెళ్ళండి. కోర్టులో చూసుకుందాం అగ్రిమెంటు సంగతి..."

బిల్డర్ గుట్కా నములుతూ తాపీగా అన్నాడు.

ఆపరేషన్ చేసేసి కడుపులో కత్తెర పెట్టి కుట్టేసినట్లుగా అయ్యింది డాక్టర్‌గారి పరిస్థితి.

"మనం మాటమీద నిలబడాలిగానీ కోర్టులేం చేస్తాయండీ..."

"నేను మాట మీద నిలబడనండీ... అంతేగా మీరనేది... అలాగే అనుకోండి నేనేం ఫీల్ కాను..."

"మీరు ఫీల్ కారు..." డాక్టరుగారు ముఖానికి పట్టిన చెమట చేత్తోనే తుడుచుకున్నారు. "ఆ ఫ్లాట్ మా అమ్మాయి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పాను. ఇప్పుడు తేడా వస్తే మా అల్లుడు ఒంటికాలు మీద లేస్తాడు". బిల్డర్ చిద్విలాసంగా నవ్వాడు.

"ఒంటికాలి మీద లేస్తాడా? ఏం పాపం మీ అల్లుడిగారికి రెండో కాలు లేదా?"

ఆ జోక్‌ను ఆస్వాదించే పొజిషన్‌లో లేరు డాక్టర్‌గారు. ఆఖరి క్షణంలో ముందుగా అనుకున్న ఎమౌంట్‌కు నాలుగు లక్షలు ఎక్కువ అడుగుతున్నాడు బిల్డర్. ఆఖరి క్షణంలో ఫిట్టింగు పెడుతున్నాడు. ఎగ్రిమెంట్ మీద కోర్టుకు వెళ్ళలేని పరిస్థితి... బ్లాక్ ఎమౌంట్‌తో కొంటున్న చీకటి ఆస్తి.

"డాక్టర్ సాబ్... ఎక్కువగా ఆలోచించకండి బి.పి. పెరుగుతుంది. మీరు కోర్టుకెళితే విషయం తేలేసరికి పాతికేళ్ళవుతుంది. నాకేం నష్టంలేదు. ఫ్లాట్స్ సెల్లార్‌లో ఇస్త్రీ షాపు వాడిచ్చే అడ్వాన్సు డబ్బులతోనే నేను కూడా కోర్టులో ఫైట్ చేస్తాను. ఇంతకముందు మీరిచ్చిన అడ్వాన్సు ఎమౌంట్ కూడా నా దగ్గరే బ్లాక్ అయిపోతుంది. బాగా ఆలోచించండి..." బిల్డర్ గీతోపదేశం చేశాడు.

డాక్టరుగారికి పరిస్థితి అర్థం అయ్యింది. చెయ్యగలిగింది ఏమీ లేదు కాబట్టి నీరసంగా అన్నాడు. "సరే! ఎల్లుండే రిజిస్ట్రేషన్ పెట్టుకుందాం... ఈ లోగా నా తంటాలేవో నేనే పడతాను..."

"మంచిది... ఆ పనిమీదే ఉండండి..."

డాక్టరుగారు వెళ్ళిపోయాక జింకను మింగిన కొండచిలువలా నవ్వుకున్నాడు బిల్డర్...

మొత్తం అంతా కోటిన్నర లాభం...

గవర్నమెంట్ స్థలం కబ్జా చేసి దొంగ ప్లాన్స్ పెట్టి పర్మిషన్ సంపాదించి. ఫ్లాట్స్ కట్టాడు. మెటీరియల్‌లో సగానికి సగం లాభం. ఈ ఫ్లాట్స్ పని అయిపోయింది కాబట్టి "ఖాళీగా ఉన్న గవర్నమెంట్ స్థలం ఎక్కడుందో వెతుక్కోవాలి" బిల్డర్ మనస్సులో లెక్కలు ప్రారంభించాడు.

* * *

"సార్! తమరు కాస్త దయచూడాలి".

"ఏంటి నాయనా! డ్రామా డైలాగులు చెబుతున్నావు!"

ఆఫీసరుగారు తన ముందు చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డ బిల్డర్ వంక చూస్తూ హేళనగా అన్నాడు.

బిల్డర్ మాట్లాడలేదు.

"నీ మీద డిపార్టుమెంటులో పెద్ద ఫైలు తయారవుతుంది. నిన్ను బ్లాక్ లిస్టులో పెట్టొచ్చు. ప్లాన్ సబ్మిట్ చేసిందానికి ఫ్లాట్స్ కట్టిందానికి సంబంధం లేదు. పై ఆఫీసర్‌గారు ఫ్లాట్స్ మొత్తం కూల్చేద్దామంటున్నాడు".

బిల్డర్ గజగజా వణికిపోయాడు.

"సార్... దయచూడాలి సార్. అప్పు చేసి కట్టాను. సర్వనాశనం అయిపోతాను సార్. ఇప్పుడు తేడా వస్తే ఆత్మహత్య చేసుకోవాలి సార్..."

"నువ్వు ఆత్మహత్య చేసుకుంటావా? అందుకే డైలాగులు చెప్పద్దంటుంది.. మర్డర్లు చేసేవాడివి నువ్వు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటావు? నీ మీద రౌడీషీట్ ఉందంటగా! మీసా క్రింద లోపలేయించి నీ ఆస్తులన్నీ గవర్నమెంట్ స్వాధీనం చేసుకోవచ్చు తెలుసా?"

"సార్! తమరు కళ్ళు తెరిస్తే బూడిదైపోతాం సార్!"

"సర్లే... కబుర్లు చెప్పమాక... సిమెంట్ బదులు ఆ బూడిదేసేగా ఫ్లాట్స్ కట్టావు..."

బిల్డర్ వెంట తెచ్చిన సూట్‌కేసులో నుంచి ఇరవై కట్టలు తీసి ఆఫీసర్‌గారి ముందు పెట్టాడు.

"ఇప్పటికైనా అర్థమైందా మా పవర్స్ ఏంటో... నీ లాంటి వాడిని రోడ్డు మీదకు లాగటానికి మాకు లక్షా తొంభై రూల్స్ ఉన్నాయి. బుద్ధిగా మాది మాకు ఇచ్చేసి నీ పని నువ్వు చూసుకో. అన్నట్లు పెద్ద సారు

జూబ్లీహిల్స్‌లో ఇల్లు కడుతున్నాడు ఓ లోడ్ సిమెంటు పంపించు...".

అలాగే అన్నట్లు బుద్ధిగా తలాడించి దండం పెట్టి ఆఫీసర్‌గారి ధగ్గర్నుంచి సెలవు తీసుకున్నాడు బిల్డర్.

ఆఫీసర్‌గారు ఆప్యాయంగా ఆ కట్టల్ని తడిమాడు.

ఆ స్పర్శ ఎంతో ఆనందాన్నిచ్చింది.

సాయంత్రం మరో పెద్ద కాంట్రాక్టర్‌గారు ఇచ్చే పార్టీలో త్రాగే విదేశీ మద్యం, అందే స్వదేశీ సుఖాల గురించి తల్చుకునే సరికి ఆఫీసర్‌గారి వళ్ళు జివ్వుమంది.

* * *

ఈ సంఘటనలు బ్రహ్మాండంలో పిపీలికం లాంటివి...

ఈ నాగరిక సమాజంలో ఇంతకంటే దారుణమైన; ఘోరమైన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

డబ్బు, సుఖాలు, సెక్స్, దుర్మార్గం, నీచత్వం, అసూయ మనిషిని ఇన్‌స్పైయిర్ చేస్తూనే ఉన్నాయి.

అవసరం, అవకాశం, ఈ రెండింటి ప్రాతిపదిక మీద ఎవరి స్థాయిలో వాళ్ళు ఎంత వీలైతే అంత దోచుకుంటూనే ఉన్నారు. సాటి మనుష్యులను దోచుకున్నారు. మానవత్వాన్ని దోచుకున్నారు. మృగాలనూ, నోరులేని జీవాలనూ దోచుకున్నారు. ప్రకృతినైతే చెప్పలేనంత దారుణంగా దోచుకున్నారు. దోచుకుని ఆ పాపఫలాన్ని డబ్బుగా, బంగారంగా, బిల్డింగులుగా మార్చుకుని తిరిగి ఆ భూమ్మీదే పెట్టుబడిగా పెట్టారు.

* * *

మనుష్యులు ఇంత నిర్లజ్జగా స్వార్థం, దుర్మార్గం, వంచనా, వెన్నుపోట్లు, క్రూరత్వం నరనరాన జీర్ణింపజేసుకుని షాపింగ్ కాంప్లెక్సులూ, మల్టీ స్టోరీడ్ బిల్డింగులూ నిర్మించుకుంటూ మానవత్వాన్ని యథాశక్తిగా సమాధి చేస్తున్న సమయంలో ఓ ఫైన్ మార్నింగ్ అరవై సెకన్లు జస్ట్ అరవై సెకన్ల పాటు భూమి కంపించింది. దశాబ్దాల తరబడి నికృష్ట లక్షణాలను బేస్ చేసుకుని కూడబెట్టుకున్న భౌతిక సంపదా, బిల్డింగులు, బంగారం, కలర్ టీ.వి.లు, ఏ.సి.లు సర్వం క్షణాల్లో ధ్వంసం అయిపోయాయి. ప్రాణాలు పోగా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు.

మళ్ళీ మొదలు... ప్రకృతి తిరిగి పాఠం చెప్పేంతవరకు ఈ మనుష్యులింతే... జీవన అజ్ఞానం తరతరాలుగా కొనసాగుతూనే ఉంటుంది. *


# ప్రియదత్త

సకుటుంబ సచిత్ర వార పత్రిక

విడి ప్రతి వెల : 7 రూపాయలు

## చందా వివరాలు

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 350.00
అర్థ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 175.00
మూడు నెలల చందా (పోస్టు ద్వారా) రూ. 88.00

# ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాసపత్రిక

విడి ప్రతి వెల : 8 రూపాయలు

## చందా వివరాలు

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 80.00
అర్థ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 40.00

**గమనిక**

సంవత్సర చందాగా రూ. 399/- చెల్లించిన పాఠకులకి ప్రియదత్త సకుటుంబ సచిత్ర వార పత్రికతో పాటు పిల్లల సచిత్ర మాస పత్రిక ఆటవిడుపుని కూడా ఏడాది పాటు పోస్టు ద్వారా మీ ఇంటికి పంపటం జరుగుతుంది. ఈ సదవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవలసినదిగా మనవి చేస్తున్నాము.

మీ చందా మొత్తాన్ని మనియార్డర్ లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా 'ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్' పేర 103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నయ్-600 004 చిరునామాకి పంపగోరుతున్నాము.

పంపినవారి పేరు, పూర్తి చిరునామా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా మనవి చేస్తున్నాము. చెన్నయ్‌లో ఉన్నవారు చెక్కు ద్వారా చందా మొత్తాన్ని పంపవచ్చు.